# కనువిప్పు

ప్రదీప్‌నగర్ కాలనీ విద్యుత్ దీపాల వెలుగుతో పట్టపగల్లా వుంది. మెయిన్ రోడ్డునుండీ లేడీస్ క్లబ్ వరకూ త్రోవకు యిరుప్రక్కలా ప్రతి పది గజాలకు ఒక ట్యూబ్‌లైట్ పెట్టేరు. దారి పొడుగునా కలర్ బల్బ్‌ల సీరియల్ సెట్స్ తోరణాలుగా వ్రేలాడదీసేరు. వెల్‌కమ్ బోర్డులు పెట్టేరు. క్లబ్ ఆవరణలో మీటింగ్‌కి కావల్సిన ఏర్పాట్లన్నీ చేసేరు. లేడీస్ క్లబ్ మెంబర్లందరూ అందాల పోటీలో పాల్గొన వచ్చినవాళ్లవలె చక్కగా అలంకరించుకొని వాలంటీర్ బేడ్జ్‌లు తగిలించుకొని హడావిడిగా తిరుగుతున్నారు. ఆరోజు లేడీస్ క్లబ్ వార్షికోత్సవం. మంత్రిగారు ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఏర్పాట్లన్నీ క్లబ్ ప్రెసిడెంట్ పంకజవల్లి పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

పంకజవల్లి పబ్లిక్ ఫిగర్. పబ్లిక్‌లో ఆవిడకు గొప్ప ఇమేజ్ వుంది. ఆ యిమేజ్‌ని నిలుపుకుందుకు ఆవిడ ఎప్పుడూ ప్రయత్నిస్తుంటుంది. అందుకు ఎంత ఖర్చయినా వెనుకాడదు. ఆవిడ లేడీస్ క్లబ్‌కేగాక మహిళా మండలిక్కూడా ప్రెసిడెంట్. స్టేటస్ చక్కగా మేన్‌టైన్ చేస్తుంది.

పరాత్పరరావు పంకజవల్లి భర్త. కోట్ల లావాదేవీలు గల బిజినెస్ అతనిది. ప్రదీప్‌నగర్ కాలనీలో ఎకరం స్థలంలో మూడంతస్తుల మేడ కట్టించేడు. పంకజవల్లి ఆ కాలనీని పోష్ కాలనీగా రూపొందించాలని ఎంతో ప్రయత్నించింది. కాని లాభం లేకపోయింది. అన్ని వర్గాలవారు సుమారు మూడువందల యిళ్లు కట్టుకొని నివసిస్తున్నారు.

ప్రదీప్‌నగర్ కాలనీలో పంకజవల్లి తన సొంత డబ్బుతో లేడీస్ క్లబ్ భవనం కట్టించింది. క్లబ్‌కి కావాల్సిన అన్ని హంగులూ సమకూర్చింది. అన్నిరకాల ఇన్డోర్ గేమ్స్ ఏర్పాటు చేయించింది. అంతేకాదు ఇన్డోర్ ఆడిటోరియమ్. అవుట్ డోర్ ఓపెన్ ఆడిటోరియమ్ కట్టించింది. అఫ్‌కోర్స్ క్లబ్‌కి ప్రతినెలా రెంట్ వసూలుచేస్తోంది. అది వేరే విషయం. క్లబ్‌లో నెలనెలా చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వాటికి డొనేషన్స్ పూర్లో పెద్దల వద్దనుండీ కలెక్ట్ చేస్తోంది.

భక్తవత్సలంగారు ఛీఫ్ ఇంజనీర్‌గా అటు డిపార్ట్‌మెంట్‌లోనూ యిటు ప్రజలలోనూ ఎంతో పేరుప్రఖ్యాతులు పొందేరు. వారు రిటైర్ అయ్యేక ప్రదీప్‌నగర్‌లో యిల్లు కట్టుకొని వుంటున్నారు. ఆయన భార్య రాధమ్మగారు ఎం.ఏ చదివేరు. నిగర్వి. గొప్ప స్నేహశీలి. ధార్మికురాలు. ఎవరికి ఎప్పుడు ఎటువంటి సహాయం కావలసి వచ్చినా ఆమె వెనుకాడరు. వారికి ఒక్కడే కొడుకు రవితేజ. మంచి డాక్టర్. ఆ కాలనీలోనే అతనికి నర్సింగ్ హోమ్ వుంది.

మేనకోడలు మనోరమనే కోడలుగా చేసుకున్నారు రాధమ్మగారు. రాధమ్మగారి మనుమడు ఆదిత్య టెన్త్ చదువుతున్నాడు. అందరికీ అన్నివేళలా అందుబాటులో వుండే డాక్టర్ రవితేజకు, కాలనీవాసుల కష్టసుఖాలలో పాలుపంచుకొంటూ వారికి తగిన సహాయం అందిస్తున్న రాధమ్మగారికీ, వారి కుటుంబ సభ్యులకు ఎనలేని గౌరవముంది. అయితే పంకజవల్లి ఎంత ప్రయత్నించినా రాధమ్మగారు, మనోరమ లేడీస్ క్లబ్‌లో చేరలేదు!

పొట్టకూటికోసం పల్లెలనుండి పిల్లాపాపలతో పట్టణానికి వలస వచ్చిన సుమారు నలభై కుటుంబాలవారు ప్రదీప్‌నగర్ కాలనీ మెయిన్ రోడ్డుకు ఆవలిప్రక్క వున్న మెరకమీద పూరిగుడిసెలు వేసుకొని కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారు. ఆరోజు ఉదయం పూరిగుడిసెలు అగ్ని ప్రమాదానికి గురయి పది గుడిసెలు పూర్తిగా కాలిపోయేయి. పది కుటుంబాలవారు నిరాశ్రయులై కట్టుబట్టలతో మిగిలేరు.

ఆదిత్య అతని స్నేహితులు పదిమందీ వెళ్లి వారి పరిస్థితి చూసేరు. వారికి వెంటనే ఏదైనా సహాయం అందించటం మంచిది అనే ఆలోచన ఆ చిన్నారులకు కల్గింది. వారిలో వారు చర్చించుకొన్నారు. గుడిసెలు కాలిపోయినవారి కుటుంబ వివ

రాధమ్మగారు ఒక కుర్ర
కుర్చీలో కూర్చున్నారు. ఆవిడకు
యిరుప్రక్కలా పదిమంది
కుర్రాళ్లు నిల్చున్నారు. నాలుగు
బెంచీలమీద పాతబట్టలు పేర్చ
బడి వున్నాయి. అందరూ నిశ్శ
బ్దంగా కూర్చున్నారు.

రాలను సేకరించేరు. రాధమ్మగారి వద్దకు వచ్చి విషయం ఆవిడకు చెప్పేరు. ఆ పిన్న వయస్సులో వారిలో కల్గిన మానవసేవా చింతనకు, ధర్మబుద్ధికి ఎంతో మెచ్చుకున్నారు.

''నాయనమ్మా! మేము వారికి హెల్ప్ చేద్దామనుకుంటున్నాం!'' అన్నాడు ఆదిత్య.

''మంచి ఆలోచన! తప్పకుండా సహాయం చెయ్యండి. ఏం చేద్దామనుకుంటున్నారు? ఇంటింటికీ వెళ్లి విషయం చెప్పి డబ్బు వసూలు చేస్తారా?''

''చెయ్యం! డబ్బులిమ్మని ఎవరినీ అడగం!'' అన్నాడు.

''పోనీ బియ్యం యిమ్మని అడుగుతారా?''

''అడగం!''

''అయితే మరి ఏ విధంగా వారికి హెల్ప్ చేస్తారు?'' అన్నారు రాధమ్మగారు ఎంతో ఆశ్చర్యంతో.

''ఎలాగంటే యిళ్లు కాలిపోయినవారు పది కుటుంబాలు. అందులో 20 మంది పెద్దవాళ్లు, 30 మంది పిల్లలు. వీరు కట్టుబట్టలతో వున్నారు. వారికి వెంటనే కావల్సింది భోజనం, బట్టలు. డబ్బులు వసూలుచేసి యిస్తే వారు సరుకులు తెచ్చుకొని వంట చేసుకుందుకు ఎంతో టైమ్ పడుతుంది. బియ్యం వసూలుచేసి యిచ్చినా వంట పాత్రలు వగైరా ఏమీలేవు కాబట్టీ వారికి యిబ్బంది...''

''అందుకని ఏం చేద్దామనుకుంటున్నారు?!'' అన్నారు. 'అన్నార్తులను ఏ విధంగా ఆదుకొంటారా' అన్న కుతూహలంతో.

''మన కాలనీలో వుంటున్నవాళ్ల యింటికి వెళ్లి విషయం చెప్పి వారు ఒక మనిషి- పెద్దవారికిగాని పిల్లవారికిగాని ఒక పూట భోజనం పెట్టమని అడుగుతాం. అంగీకరించిన వారింటికి అగ్నిబాధితుల కుటుంబంలో ఒకరిని తీసుకొని వెళ్లి అప్పగించుతాం. అలా చేస్తే ఏ యింటివారైనా వారికి భోజనం కోసం ప్రత్యేకమైన ఏర్పాటు చెయ్యక్కర లేదు. రెండోది బట్టలు! మేము ఓల్డ్ గార్మెంట్స్, యింట్లో వాళ్లు వాడకుండా మూల పడవేసిన బట్టలు-చీరలు, జాకెట్స్, లంగాలు, పంచెలు, చొక్కాలు, పిల్లల బట్టలు వుంటే యిమ్మని అడిగి వాటిని కలెక్ట్ చేసి రాత్రి స్కూలు వద్దకు అందర్నీ రమ్మనమని ఎవరికి ఏవి సరిపోతాయో చూసి యిస్తాము. భోజనం పెట్టేవారి పేరు, ఓల్డ్‌గార్మెంట్స్ యిచ్చినవారి పేరు రాసుకొని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తాం. ఎలా వుంది నాయనమ్మా మా ప్లాన్'' అన్నాడు ఆదిత్య.

మనవడి ప్లాన్ ఎంతో మెచ్చుకొన్నారు రాధమ్మగారు.

''ఎవరూ యిందువల్ల యిబ్బంది పడరు. తమ కొరకు వండుకుంటునప్పుడు ఓ పిడికెడు బియ్యం అదనంగా వేసి ఉడికిస్తే చాలు!''

కోడలిని పిల్చి విషయం చెప్పేరు రాధమ్మగారు.

మనోరమ వారికి మంచి ప్రోత్సాహమిచ్చింది.

''మా యింటితోనే ప్రారంభించండి! ఈరోజు రెండుపూటలా మా యింటికి ఒక పెద్దవారినిగాని, లేదా యిద్దరు పిల్లలనుగాని భోజనానికి పంపించండి. పాతబట్టలు తీసి వుంచుతాను'' అంది.

''థాంక్స్ మమ్మీ!'' అన్నాడు ఆదిత్య సంతోషంతో.

సహాయమడిగిన ప్రతి ఒక్కరూ వీరికి చక్కటి ప్రోత్సాహమిచ్చేరు. ఎవరూ కాదనలేదు. ఎంతో హర్షించేరు. అగ్ని బాధితులను తమతో తీసుకొని వెళ్లి భోజనం పెట్టడానికి అంగీకరించిన వారి యింట అప్పగించేరు.

అనుకున్నదానికంటే ఎన్నోరెట్లు అధికంగా పాతబట్టలు సమకూరేయి. వాటిని సేగ్రికేట్ చెయ్యడంలో రాధమ్మగారు, మనోరమ, ఇరుగు పొరుగువాళ్లు వారికి హెల్ప్ చేసేరు.

లేడీస్ క్లబ్ వార్షికోత్సవ ఫంక్షన్ అనుకున్న టైమ్‌కే స్టార్ట్ చేసేరు. క్లబ్ కార్యవర్గ సభ్యులు వారి ప్రెసిడెంట్ పంకజవల్లిని ఘనంగా పొగిడేరు. ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రిగారిని ఉచితరీతిని సత్కరించేరు. నలుగురు బీద విద్యార్థులకు మంత్రిగారి చేత క్లాసు పుస్తకాలు, ఒక్కొక్కరికీ నూటొక్క రూపాయల నగదు యిప్పించేరు. ఆటల పాటల పోటీలలో గెలుపొం

దిన విజేతలకు బహుమతులు యిప్పించేరు. సాంస్కృతిక కార్యక్రమం తరువాత బఫే డిన్నరు ఏర్పాటుచేసేరు. కార్యక్రమం కవరేజ్‌కి టీవీలవారు, పత్రికలవారు వచ్చేరు.

కార్యక్రమం అనంతరం మంత్రిగారు, కూడా వచ్చిన అధికారులూ కార్లలో బయల్దేరేరు. వారు ప్రదీప్‌నగర్ కాలనీ దాటుతుండగా ఓ స్కూలు ఆవరణలో సుమారు మూడువందల మంది సమావేశమై వుండడం చూసి కారు ఆపించి వెంటవున్న అధికారులను విషయం అడిగి తెల్సుకున్నారు. కారు దిగి ఎవరి దృష్టీ ఆకర్షించకుండా నెమ్మదిగా వెళ్లి కొద్దిదూరంలో నిలబడ్డారు.



అక్కడ ఏ విధమైన హంగులూ ఆర్భాటాలూ లేవు. రెండు ట్యూబ్‌లైట్స్ ఒక మైక్ అమర్చబడి వున్నాయి. రాధమ్మగారు ఒక కర్ర కుర్చీలో కూర్చున్నారు. ఆవిడకు యిరు ప్రక్కలా పదిమంది కుర్రాళ్లు నిల్చున్నారు. నాలుగు బెంచీలమీద పాతబట్టలు పేర్చబడి వున్నాయి. అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

రాధమ్మగారు మైకు ముందుకొచ్చేరు.

''మన కాలనీప్రక్క మెరక ప్రాంతంలో కూలిపనులు చేసుకుంటున్న 40 కుటుంబాలవారు పూరిగుడిసెలు వేసుకొని వుంటున్నారు. ఈరోజు ఉదయం అగ్ని ప్రమాదంలో పది యిళ్లు కాలిపోయి 20 మంది పెద్దలు, 30 మంది పిల్లలూ కట్టుబట్టలతో మిగిలేరు. మన కాలనీలోని ఈ పదిమంది విద్యార్థులూ వెళ్లి అగ్ని బాధితుల దీనావస్థను చూసేరు. వారికి యుద్ధప్రాతిపదికగా తక్షణ సహాయం అందించాలనే మంచి ఆలోచన వారికి కల్గింది. అందుకుగాను వారు వేసుకొన్న పథకం యిప్పటివరకూ ఎవరూ ఆలోచించనిది! అంతేకాదు అందరికీ అందుబాటులో వున్నది! అదేమిటంటే యీ చిన్నారులు ఎవరినీ డబ్బులిమ్మని చందాలు పోగుచెయ్యలేదు. బియ్యం, పప్పులు యిమ్మనలేదు. మీరు మీకోసం వంట చేసుకుంటున్నప్పుడు పిడికెడు బియ్యం అదనంగా ఉడికించి అగ్ని బాధితుల కుటుంబంలో ఒకరికి ఒక్కపూట మీ యింట భోజనం పెట్టమని కోరేరు. అందుకు మన కాలనీవాసులంతా సంతోషంతో అంగీకరించి యీ చిన్నారుల ఆలోచనలను ఆచరణలో పెట్టి ప్రోత్సహించేరు.''

''రెండోది బట్టలు. వీరు యింటింటికీ వెళ్లి పాతబట్టలు కలెక్ట్ చేసేరు. ఇప్పుడు వాటిని అగ్ని బాధితులకు అందజేస్తారు'' అన్నారు రాధమ్మగారు.

ఆదిత్య అగ్ని బాధితుల కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల పేర్లు చదువగా వారు వచ్చి వారికి సరిపోయిన సైజు బట్టలు అందుకున్నారు. ప్రతి ఒక్కరికీ నాలుగు జతల బట్టలు అందేయి.

ఆదిత్య ఫ్రెండ్స్ తమకు ప్రోత్సాహమిచ్చి అగ్ని బాధితులకు సహాయమందించిన వారికి ధన్యవాదాలు తెలిపేరు.

అగ్ని బాధితులలో కొద్దిగా వయస్సు మళ్లిన వ్యక్తి ముందుకు వచ్చి అందరికీ నమస్కరించి-

''మా వు పొట్టలు సేత యిడుకొని పెల్లాం పిల్లల్ని ఎంటేసుకొని యీ పట్టనంల కూలి సేసుకు బతుకుదావని వచ్చేసినాం. ఈ పొద్దుపెందిల మా గుడిసెలు కాలిపోనాయి. కట్టుగుడ్డల్తో యీదిన పడ్డాం. పెమాదం సూడను ఎందరో పెదభావులు కార్లలోన జీపీల్లోనా వొచ్చి అడిగింతే పది సుట్లు అడిగి ఫోటోలు దీసుకొని. ఏటేటో రాసుకొని ఎల్లిపోనారు. మా గుంటలు ఆకలికి అల్లాడిపోతన్నారు. ఆల్లకు గుక్కెడు గంజినీళ్లుగాని, యిన్ని టీ సుక్కలుగాని పొయ్యడానికి మాకాడ ఏటీ నేదు.''

ఈ సినబాబులు సెట్టుకింద సేరి అంతా సూసినారు. ఆల్లలో ఆల్లు కూడబలుక్కొని జేబీల్లో సిల్లర పోగేసి రోడ్డుమొగలో సిమ్మాసెలం గోరి టీ దుకానం కాడకు మా గుంటల్ని దోలుకెల్లి టిపీను, టీ ఎట్టించి ఆల్ల కడుపు మంట సల్లార్సినారు. మమ్మల్ని దరమ తల్లుల కప్పగించి యీ పొద్దు రెండు సుట్లూ కడుపునిండా బువ్వ ఎట్టించి కట్టుకోను ఒక్కొక్కరికీ నాలుగు జతల బట్టలిచ్చినారు. మాకు కూడు గుడ్డ ఎట్టి పేనాలు కాసిన దేవుల్లండీ యీ సినబాబులు! మా సెరమాలు సెప్పులు కుట్టీ యిచ్చినా ఆరు యీ పొద్దు సేసిన మేలు తీరదండీ! ఆ సినబాబులకు ఆరిని కన్నోరికి కడుపునిండా కూడెట్టిన దరమ తల్లులకు మా దండాలండి'' అన్నాడు.

అంతా గమనించిన మంత్రిగారి మనస్సు చలించిపోయింది. వెంటనే వెళ్లి ఆ చిన్నారులను అభినందించాలనుకొన్నారు. అయితే వారికి అడుగు ముందుకు పడలేదు. కారణం- అధికారం, అంగబలం, అర్థబలం వున్న తనలాంటివారు చెప్పాల్సినవి మాటలు కావని చేతలని ఆ చిన్నారులు 'కనువిప్పు' కల్గించడమే. ★

**రావి-ఎన్-అవధాని**